# వేల్ పిక్చర్సువారి సీతాకల్యాణము

ఆర్. ఎస్. ఆంజనేయశాస్త్రిగారు

ఇన్నాళ్ళకు, ఆంధ్రుల పెట్టుబడితో ఆంధ్ర డైరక్టర్ల యజమాయిషీక్రింద, ఆంధ్రఫిల్ములు తీయటానికి, ఆంధ్ర ఫిల్మ్ కంపెనీ— ఆంధ్రదేశంలో మాత్రం కాదు ?— స్థాపింపబడ్డది. నిజానికి ఆ విషయం ప్రతి ఆంధ్రుడూ హర్షించ దగిందే! వారి ప్రథమ టాకీకూడా, దర్శించే భాగ్యం మనకి గల్గింది. పౌరాణికగాధలంటే, తెలుగువాళ్ళకి, ఎక్కువ ప్రీతి అనో, ఆధునిక మానవజీవితాన్ని ప్రతిబింబింప జేసే ఇతివృత్తాల్ని రచింపించి ప్రదర్శింప చేయడం కష్టమనో, గాని, నేటివరకు ప్రకటితమైన తెలుగు టాకీలన్నీ, పౌరాణికమే! పూర్వసాంప్రదాయం ఎందుకు పోనివ్వాలని, మన వేల్ పిక్చర్సువారుగూడా "సీతాకల్యాణం" ఫిల్ము తీశారు ప్రప్రథమంగా.

ఇహ అసలు కథలోకి వద్దాం. పాటలూ పద్యాలూ తగ్గించటం ఓ గొప్ప విశేషం—కాని, వున్న కొద్ది పద్యాలే, కళావిములికి విసుగు పుట్టించాయి. నాటకాల్లోనూ, టాకీల్లోను, పద్యాలూ, పాటలూ అసలుండరాదనుగాని, ఉన్నపద్యాల్ని కొంతవరకు తగ్గించి, మిగిలినవాటిని బహు సొంపుగా, ముక్తసరిగా పాడితే ఎంతో బాగుంటుంది గాని వెధవబెల్లపుపాకంలాగా, ప్రతిపాదాన్నీ సాగతీస్తూ, సంగతులపై సంగతులేస్తూ, మొహం చిట్లించి, మూతి నానా అష్టాకరంగా తిప్పుతూ, రొప్పుతూ, అకారాలతో, అరగంటసేపు మంప తెంపితే నానారసాభాసగా వుంటుంది. సంగీతం వింటానికని నాటకాని కొచ్చే వాళ్ళ కేమైన రుచిస్తుందేమో గాని, నాటకం చూట్టానికని, నాటకాని కొచ్చేవాళ్లకి మాత్రం చాలా విరసంగాను, అసహ్యంగానూ వుంటుంది — ఈ విషయం మన సీతాకల్యాణంలోని నటులు విస్మరించారనాలి పోస్తుంది — లేక తెలీనే తెలియదేమో !

ఇంకో విషయం—తెల్లుగు గడ్డలోవున్న పేరొందిన నటకులంతా కాకపోయినా — ఆఖరికి కొంతమందయినా దీనిలో పాల్గొనక పోవటం డైరక్టర్లలో వుందో లేక నటుల్లోనే వుందో తెలియదు. ఒక్క వెంకట్రామయ్యగారు, మరిద్దరు తప్పితే తక్కిన వాళ్లంతా మొన్న మొన్ననే రంగస్థలంలో కొచ్చిన రకం. బహుశః పెద్దరకం నటులంతా అధిక ద్రవ్యం అడిగుండవచ్చు కంపెనీవారు భరింపలేకపోవచ్చు. కాని, మన నటులే కొంత ఉదారస్వభావం చూపించి వుంటే బాగుండేది. అయిపోయినదానికి విచారించటం కన్న పాల్గొన్నవారు టాకీని ఎంతవరకు రసవంతంగా తీసుకొచ్చారో చూద్దాం.

మస్తుల విషయంలో, పాత్రధారణా పరికరాల్లోనూ, ఏ మాత్రం శ్రద్ధవహించినట్టు కనబడదు. ఒక్క విశ్వామిత్రుని గడ్డం తప్ప మిగిలిన ఋషులు, ఋషికుమారుల గడ్డాలు, మీసాలు, బహు అసహ్యంగా వున్నాయి. వసిష్ఠుడి గడ్డం మరీని...గోగునారకట్టే. ఉపపాత్రల విషయం అశ్రద్ధ చెయ్యటం మూలాన కూడ నాటకం తృప్తిగా వుండక పోవటానికి, అవకాశం చాలా వుంది చూడండి! సీత చెలికత్తెలుగా 'అటువంటి కురూపుల్ని ప్రవేశపెట్టడం ఎంత అసందర్భంగా వుందో ?